



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 03 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 23-07-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

పేదోల్లు చదువు రానోల్లు
కూలినాలి కాయకష్టం చేసెటోల్లు
"ఓటు" నమోదుకు వరుసలు కడుతున్నరు.
భాధ్యతగల పౌరులుగ
భారులు తీరుతున్నరు.
"ఓటు"ను నమ్ముకున్నా అమ్ముకున్నా !
పేదోల్లే ముందున్నరు.
ఓటు విలువ తెలుసుకున్నరు.
చదువు కొన్నోల్లు దాగుడు మూతల
ధనవంతులు నోటు విలువ తెలిసినంత
ఓటు విలువ తెలియనోల్లు
ఓటు వేయరానోల్లే అగ్ర తాంభూళానికి
అర్రులు సాచటోల్లుసంఘంలో కో కొల్లలు
మంచంలో నల్లులు.గోడ మీది పిల్లులు.
దేశం కాని దేశపోల్లు సాటు మాటుగ సొచ్చి
నోల్లు సుట్టరికం కలుపుకొని సూరుపట్టుక
వేలాడెటోల్లు భారతంలో ఓటు కై
బానిసలుగ బతికెటోల్లు రోహింగ్యాల పేరుతో
రోజూ వినిపించే వార్తలూ !
వీరి కండ్లు తెరిపించవు వీరికి భాధ్యతలు
కనిపించవు. నోటు మీది ఆరాటం
ఓటు మీద ఉంటే లుచ్చానాయకులు
సచ్చినట్టు తప్పుకొందురు.
అమ్ముడుబోయే అలవాటుకొంతైనా
మానుకొందురు.నీతిమంతులు రీతిమంతులు
నాయకులై వెలుగొందురు.
ఓటు వేయరానోల్ల
ఆస్తులు జప్తు అంటే
ఆస్తులు లేని వాల్లఊరి బహిష్కరణుంటే
ఎక్కడున్న వచ్చివాలు
ఏలు మీద "సిరా" ఉండు చాలు.

– మీ .... రాజి రెడ్డి శీలం..
ఇనుగుర్తి .

# నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం

- రాజకీయాలు చేయొద్దని రాహుల్‌కు జేపీ నడ్డా సూచన
- నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో లోతైన చర్చకు కేంద్రం సిద్ధమని స్పష్టం
- విద్యార్థుల సమస్యలతో రాజకీయ లబ్ధి పొందాలని చూడొద్దని కాంగ్రెస్‌కు హితవు
- ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లోనూ పేపర్ లీక్ ఘటనలు జరిగాయని జేపీ నడ్డా వ్యాఖ్య
- అన్ని ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు ప్రజల ముందుకు తీసు కొస్తామని హామీ



**ప్రజావాయిస్, న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్ వేదికగా సమగ్ర, లోతైన చర్చకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశాన్ని రాజకీయాలకు వేదికగా మార్చకుండా, సమస్య పరిష్కారానికి ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి సూచించారు.

**విద్యార్థుల సమస్యలపై రాజకీయాలు తగవు**

విద్యార్థుల డిమాండ్లు, ఆందోళనలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సమంజసం కాదని జేపీ నడ్డా అన్నారు. ఈ అంశంపై విమర్శలు చేయడం కంటే బాధ్యతాయుతంగా వ్యవహరించి, పరిష్కారం కోసం సహకరించాలని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు.

**ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై ప్రశ్నలు**

జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా పేపర్ లీక్ ఘటనలు వెలుగుచూశాయని నడ్డా పేర్కొన్నారు. అలాంటి ఘటనలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేవలం ఎన్డీయే పాలిత రాష్ట్రాల అంశాలనే ఎంచుకుని విమర్శించడం సరికాదన్నారు.

**అన్ని కేసులపై దర్యాప్తుకు సిద్ధం**

దేశవ్యాప్తంగా 150 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్పందించిన జేపీ నడ్డా, ప్రతి ఆరోపణను ప్రభుత్వం అత్యంత బాధ్యతతో పరిశీలిస్తుందని తెలిపారు. అన్ని కేసులపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకొస్తామని స్పష్టం చేశారు.



## లీక్‌పై తెలంగాణ రగిలింది..!

- పరీక్ష పత్రం లీక్‌తో దేశ వ్యాప్తంగా విద్యార్థుల్లో ఆందోళన తెలంగాణలో కాంగ్రెస్ నిరసనల జ్వాలలు
- నీట్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి అసలు సూత్రధారులను అరెస్ట్ చేయాలని కేంద్రానికి కాంగ్రెస్ డిమాండ్
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దంటూ రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు
- ప్రశ్నించిన వారిపై పోలీసు చర్యలు ఎందుకు.?వైఫల్యానికి బాధ్యత వహిం చాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన కాంగ్రెస్
- లీక్ అయింది ప్రశ్నాపత్రం కాదు విద్యా వ్యవస్థపై విద్యార్థుల నమ్మకం అంటూ తెలంగాణ వ్యాప్తంగా నిరసన గళం

2లో



## ఎల్ నినోపై కేటీఆర్‌కు అవగాహన లేదు

- మేడిగడ్డపై సమాధానం చెప్పాలి
- భట్టి ఎల్ నినో ప్రభావాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టడం బాధ్యతారాహిత్యమని విమర్శ
- కేటీఆర్ వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని మండిపాటు
- కాంగ్రెస్ నిర్మించిన ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు ఇప్పటికీ పటిష్టంగా ఉన్నాయని వెల్లడి
- కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ మూడేళ్లకే ఎందుకు కుంగిపోయిందో హరీశ్ రావు చెప్పాలని డిమాండ్
- ప్రభుత్వంపై విషప్రచారం చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిక

**ప్రజా వాయిస్, హైదరాబాద్.** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన "కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు" వ్యాఖ్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. ప్రపంచ

మిగతా 2లో

## కామాతురాణాం... న భయం న లజ్జ

- రక్తచరిత్ర రాస్తున్న వివాహేతర సంబంధాలు
- మోజులో భర్తలను కిరాతకంగా హత్య చేస్తున్న భార్యలు
- అడ్డొస్తున్నారని పిల్లలనూ బలి తీసుకుంటున్న పైశాచికం
- ఎంత పక్కా ప్లాన్ చేసినా ఆధునిక టెక్నాలజీ ముందు దొరుకుతున్న నేరస్తులు

2లో





## నీట్ పేపర్ లీక్‌పై కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

- ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- కొడంగల్‌లో నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- నీట్ అక్రమాలకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిం చాలని డిమాండ్
- విద్యార్థులపై లాఠీచార్జ్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆగ్రహం

**ప్రజావాయిస్, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ తీరును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. విద్యార్థులకు మద్దతుగా శాంతియుత నిరసన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును ఖండిస్తూ వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

**ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి**

నీట్ పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం అంధకారంలోకి నెట్టిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వైఫల్యం కారణంగానే పేపర్ లీక్ వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ, ఆయనను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనను

మిగతా 2లో

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు వేగవంతం

- అకాడమీలో బాధిత అధికారిణి వాంగ్మూలం నమోదు
- ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ అయిన కేసు దర్యాప్తు ప్రారంభం
- ఎస్‌వీపీఎన్‌పీఏలో బాధిత ట్రైనీ ఐపీఎస్ అధికారిణి స్టేట్‌మెంట్ నమోదు
- డిజిటల్ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలపై సమగ్ర విచారణ
- డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు



2లో

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణలో కాంగ్రెస్ ఆందోళనలు

- ఏఐసీసీ పిలుపుతో తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు
- హైదరాబాద్‌లో 'ఛలో లోక్‌భవన్' ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు దామోదర రాజ నర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అరెస్ట్
- హనుమకొండలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నిరసనలు




**ప్రజావాయిస్, హైదరాబాద్:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నేతల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ఆందోళనలు చేపట్టాయి. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఛలో లోక్‌భవన్' ర్యాలీ ఉద్రిక్తం**

హైదరాబాద్ నెక్లెస్ రోడ్ నుంచి లోక్‌భవన్ వైపు వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీకి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వం వహించగా, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నేత అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ లోక్‌భవన్ వైపు కదిలారు.

**ముఖ్య నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్

మిగతా 2లో

## ట్రాన్స్‌కో డీఈ అక్రమాస్తుల గుట్టురట్టు

- రూ.27.65 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ మెరుపు దాడులు
- 9 ప్రాంతాల్లో సోదాలు..

  2 కిలోలకు పైగా బంగారం, రూ.52 లక్షల నగదు స్వాధీనం
- ఫ్లాట్లు, కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్లు, విలువైన పత్రాలు గుర్తింపు
- గతంలో లంచం కేసులో చిక్కిన వెంకటరమణను అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేసిన అధికారులు



2లో

# లీక్‌పై తెలంగాణ రగిలింది..!

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** దేశంలో డాక్టర్ కావాలనే లక్షలాది మంది విద్యార్థుల కలలకు నీట్ పేపర్ లీకేజీ భారీ దెబ్బగా మారిందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. నెలలు, సంవత్సరాల పాటు రేయింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తు ఒక్క లీకేజీతో అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో జరిగిన ఈ ఘోర వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రోడ్డెక్కాయి.

**లీక్ అయింది పేపర్ కాదు..**
**విద్యా వ్యవస్థపై నమ్మకం**

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజక వర్గాలు, మండల కేంద్రాల్లో జరిగిన నిరసనల్లో కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. నీట్ లీకేజీ అనేది ఒక పరీక్షలో జరిగిన లోపం మాత్రమే కాదని, దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచిన విశ్వాసానికే పెద్ద దెబ్బ అని పేర్కొన్నారు.

**సమగ్ర విచారణ జరిపి**
**అసలు దోషులను శిక్షించాలి**

పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి అసలు సూత్రధారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు తగిన సహాయం అందించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు.





**విద్యార్థులకు మద్దతిస్తే..**
**అరెస్టులే సమాధానమా.?**

విద్యార్థులకు సంఘీభావంగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర నాయకులపై పోలీసు చర్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును అణచివేయడం ద్వారా నిజాలను దాచలేరని, విద్యార్థుల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరసనలను అణచివేసే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని విమర్శించారు.

**తెలంగాణ వ్యాప్తంగా నిరసన జ్వాలలు**

తెలంగాణలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించేది లేదు, అసలు దోషులను శిక్షించే వరకు పోరాటం ఆగదు అని హెచ్చరించారు.పరీక్షలను పారదర్శకంగా నిర్వహించలేని ప్రభుత్వం దేశ భవిష్యత్తును ఎలా నిర్మిస్తుందని అంటూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో నిజాలు వెలుగులోకి వచ్చే వరకు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ట్రాన్స్‌కో డీఈ అక్రమాస్తుల గుట్టురట్టు

**ప్రజావాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన మెరుపు దాడుల్లో భారీ ఎత్తున ఆదాయానికి మించిన ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, బంగారం, నగదు, స్థిరాస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వెంకటరమణను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

**రూ.27.65 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు**

ప్రాథమిక విచారణలో ముత్యం వెంకటరమణ ఆదాయానికి మించి సుమారు రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ విలువ నిర్ధారించగా, బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని అధికారులు తెలిపారు.

**బంగారం, నగదు, కార్లు స్వాధీనం**

సుమారు 12 గంటల పాటు కొనసాగిన సోదాల్లో 2 కిలోలకు పైగా బంగారు ఆభరణాలు, రూ.52 లక్షల నగదు, వజ్రాభరణాలు, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ మద్యం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన మూడు కార్లను కూడా సీజ్ చేశారు.

**భారీ స్థిరాస్తుల గుర్తింపు**

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో నివాస ఫ్లాట్లు, కమర్షియల్ భవనాలు, గుట్టల బేగంపేట్‌లో జీ+5 భవనం, మూసాపేట్‌లో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న 10 అపార్ట్‌మెంట్లను గుర్తించారు. వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ పెట్టుబడులు ఉన్నట్లు కూడా ఏసీబీ అధికారులు గుర్తించారు.

**లోతుగా కొనసాగుతున్న దర్యాప్తు**

ప్రస్తుతం రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో)లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ముత్యం వెంకటరమణ గతంలో 2019లో లంచం కేసులో కూడా ఏసీబీకి చిక్కారు. అప్పటి నుంచి ఆయనపై నిఘా కొనసాగించిన అధికారులు, ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, స్థిరాస్తుల రికార్డులను పరిశీలిస్తూ అక్రమాస్తుల కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణలో కాంగ్రెస్ ఆందోళనలు

**మొదటి పేజీ తరువాయి**

నాయకులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

**హనుమకొండలోనూ భారీ నిరసనలు**

హనుమకొండ జిల్లా కేంద్రంలో కూడా ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు.



# నీట్ పేపర్ లీక్‌పై కేంద్రంపై రేవంత్ రెడ్డి ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

తొలగించలేకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని అన్నారు.

**విద్యార్థులపై**
**లాఠీచార్జ్ అమానుషం**

శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**బీజేపీపై ఘాటు విమర్శలు**

ఈ సందర్భంగా బీజేపీపై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్ పోరాటాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పోరాటం కేవలం కాంగ్రెస్–బీజేపీ మధ్య రాజకీయ పోరు కాదని, దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న సిద్ధాంతాల పోరాటమని వ్యాఖ్యానించారు.

**దేశవ్యాప్తంగా**
**పోరాటం ఉధృతం చేస్తాం**

మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంట్ వరకు ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు.






# ఎల్ నినోపై కేటీఆర్‌కు అవగాహన లేదు

**మొదటి పేజీ తరువాయి**

వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావంపై కనీస అవగాహన లేకుండా కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. అమెరికాలో చదువుకున్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు.హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్ నినో ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు స్పష్టంగా చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణకు వేల కిలోమీటర్ల దూరంలో ఏర్పడే ప్రకృతి పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యులను చేయడం సరికాదని అన్నారు.ప్రతిపక్షం నిర్మాణాత్మక సూచనలు చేస్తే ప్రభుత్వం స్వాగతిస్తుందని, కానీ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అసత్య ప్రచారం చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని భట్టి హెచ్చరించారు. బీఆర్ఎస్ పాలనలో అక్రమంగా కూడబెట్టిన సొమ్ముతో కొన్ని మీడియా సంస్థల ద్వారా ప్రభుత్వంపై నిరాధార ప్రచారం జరుగుతోందని ఆరోపించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావును ఉద్దేశించి భట్టి విక్రమార్క పలు ప్రశ్నలు సంధించారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించామని చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కేవలం మూడేళ్లకే ఎందుకు కుంగిపోయిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.కాళేశ్వరం కంటే ఎగువన కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇప్పటికీ సురక్షితంగా ఉండి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని, అలాగే దశాబ్దాల క్రితం నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కూడా గోదావరి వరదలను సమర్థంగా తట్టుకుని చెక్కుచెదరకుండా నిలిచిందని గుర్తు చేశారు."అదే గోదావరి నది... అదే ఇసుక పునాది... కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తుంటే, బీఆర్ఎస్ నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ మాత్రం మూడేళ్లకే ఎందుకు కుంగిపోయిందో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి" అని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు వేగవంతం

**ప్రజావాయిస్, హైదరాబాద్:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును పోలీసు ఉన్నతాధికారులు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేయగా, దర్యాప్తు బాధ్యతలు చేపట్టిన డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ బుధవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీఎన్‌పీఏ)కు వెళ్లి విచారణ ప్రక్రియను ప్రారంభించారు.

**బాధిత అధికారిణి**
**వాంగ్మూలం నమోదు**

కేసులో ఫిర్యాదు చేసిన ట్రైనీ ఐపీఎస్ అధికారిణి వాంగ్మూలాన్ని అకాడమీలో ఉన్నతాధికారుల సమక్షంలో నమోదు చేస్తున్నారు. ఈ వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.


**ఆధారాలపై సమగ్ర విచారణ**

ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలతో పాటు అందుబాటులో ఉన్న డిజిటల్ ఆధారాలు, ఇతర సాక్ష్యాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించనున్నారు. అలాగే అకాడమీలోని అధికారులు, సహచర ట్రైనీలు, కేసుకు సంబంధించిన ఇతర వ్యక్తుల వివరాలను కూడా దర్యాప్తు బృందం సేకరించనుంది.

**ఉమెన్ సేఫ్టీ వింగ్ ప్రత్యేక దర్యాప్తు**

మహిళా భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఈ కేసును ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేశారు. డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తూ వాస్తవాలను వెలికితీసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ పరిణామాలతో ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది.

# కామాతురాణాం... న భయం న లజ్జ




**ప్రజా వాయిస్ డెస్క్, హైదరాబాద్.** "కామాతురాణాం న భయం న లజ్జ" అనే సంస్కృత సూక్తి నేటి సమాజంలో చోటుచేసుకుంటున్న కొన్ని దారుణ ఘటనలను గుర్తుకు తెస్తోంది. వివాహేతర సంబంధాల మోజులో కొందరు భర్తలను అత్యంత కిరాతకంగా హత్య చేయడం, అడ్డుగా ఉన్నారనే కారణంతో అమాయక చిన్నారులను కూడా బలి తీసుకోవడం వంటి ఘటనలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి.ప్రేమ, నమ్మకం, బాధ్యతలపై నిలవాల్సిన వైవాహిక బంధం కొన్ని సందర్భాల్లో రక్తచరిత్రగా మారుతోంది. భర్తలను ప్రియులతో కలిసి హత్య చేయడం, ప్రమాదంగా చిత్రీకరించడం, ఆధారాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో మృతదేహాలను ముక్కలుగా చేయడం వంటి దారుణాలు ఇటీవల తరచూ వెలుగుచూస్తున్నాయి. ఈ ఘటనలు భారతీయ కుటుంబ వ్యవస్థ, వివాహ బంధం పవిత్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

**ఆధునిక టెక్నాలజీ ముందు**
**దాగని నేరాలు**

ఉత్తరప్రదేశ్‌లోని శంబల్ జిల్లాలో చోటుచేసుకున్న సంచలన హత్య కేసు, తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాలో బ్యాంకు రుణం మాఫీ కోసం భర్తను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన ఘటన, మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి ఆత్మహత్యగా చూపించేందుకు చేసిన ప్రయత్నం వంటి కేసులు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.శంబల్ ఘటనలో రాహుల్ అనే వ్యక్తిని అతని భార్య రూబీ, ప్రియుడు గౌరవ్‌తో కలిసి హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా చేసి కాల్వలో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. చివరకు మృతుడి చేతిపై ఉన్న టాటూ, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలతో కేసు ఛేదించారు. ఈ ఘటనలు ఆధునిక దర్యాప్తు సాంకేతికత నుంచి నేరస్తులు తప్పించుకోవడం ఎంత కష్టమో చాటిచెబుతున్నాయి.

**అడ్డంకిని తొలగిస్తే సమస్య**
**తీరుతుందనే ప్రమాదకర భావన**

వివాహేతర సంబంధాలు మొదట రహస్యంగా ప్రారంభమైనా, ఆ తర్వాత అనుమానాలు, భయం, సామాజిక ఒత్తిడి, భవిష్యత్తుపై ఆందోళన వంటి అంశాలు కలిసి "అడ్డుగా ఉన్న వ్యక్తిని తొలగిస్తే సమస్య పరిష్కారమవుతుంది" అనే ప్రమాదకర ఆలోచనకు దారితీస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అదే చివరకు హత్యల వరకు తీసుకెళ్తోందని చెబుతున్నారు.

**అత్యంత క్రూరంగా మారుతున్న నేరాలు**

ఇటీవల నమోదవుతున్న కేసుల్లో అత్యంత కలచివేసే అంశం నేరాల క్రూరత్వం. హత్య చేసిన తర్వాత మృతదేహాలను ముక్కలుగా చేయడం, డ్రమ్‌లలో దాచడం, కాల్చివేయడం, గ్రైండర్‌లో వేయడం, ప్రమాదంగా చిత్రీకరించడం వంటి చర్యలు నేరస్తుల మానసిక స్థితిని ప్రతిబింబిస్తున్నాయి.అంతేకాదు, వివాహేతర సంబంధాలకు అడ్డుగా ఉన్నారనే కారణంతో చిన్నారులను కూడా హత్య చేసిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తల్లిదండ్రుల మధ్య వివాదాలకు అమాయక పిల్లలు బలవుతుండడం కుటుంబ వ్యవస్థ ఎంతగా దెబ్బతింటోందో సూచిస్తోంది.

**ఇటీవల దేశాన్ని కుదిపేసిన కొన్ని కేసులు**

- మీరట్ డ్రమ్ మర్డర్:ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో భార్య, ఆమె ప్రియుడు కలిసి భర్తను హత్య చేసి మృతదేహాన్ని డ్రమ్‌లో దాచారు. దుర్వాసనతో విషయం బయటపడగా, ఫోరెన్సిక్ ఆధారాలు, కాల్ డేటాతో కేసు ఛేదించారు.
- బీహార్ లవ్ అఫైర్ మర్డర్:భార్య, ప్రియుడు కలిసి భర్తను హత్య చేసి ప్రమాద మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అయితే పోస్టుమార్టం నివేదికలో హత్యగా తేలడంతో నిజం బయటపడింది.
- ఇండోర్ విషప్రయోగం కేసు:మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో భార్య ఆహారంలో విషం కలిపి భర్తను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వాట్సాప్ చాట్లు, ఫోరెన్సిక్ పరీక్షలు కీలక ఆధారాలయ్యాయి.
- జైపూర్ ప్లాన్డ్ మర్డర్:రాజస్థాన్‌లో భర్తను పక్కా ప్రణాళికతో హత్య చేసి ప్రమాదంగా చూపించే ప్రయత్నం చేశారు. సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ లొకేషన్ ఆధారంగా నిందితులు చిక్కారు.
- నాసిక్ ఫామ్‌హౌస్ హత్య:మహారాష్ట్రలోని నాసిక్‌లో ప్రియుడితో కలిసి భర్తను ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి హత్య చేసిన కేసు సంచలనం సృష్టించింది. ఆస్తి వివాదం, వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు వెల్లడించారు.

**సోషల్ మీడియా ప్రభావం కూడా ఒక కారణమేనా?**

సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, సోషల్ మీడియా ద్వారా ఏర్పడే పరిచయాలు, నియంత్రణలేని భావోద్వేగాలు, వ్యక్తిగత గోప్యత పేరుతో బాధ్యతల నుంచి తప్పించుకునే ధోరణి కూడా ఇలాంటి ఘటనలకు ఒక కారణంగా మారుతోంది. కుటుంబ విలువలు బలహీనపడటం, సమస్యలకు చట్టబద్ధమైన పరిష్కారాలకంటే తక్షణ అనైతిక మార్గాలను ఎంచుకోవడం సమాజానికి ప్రమాదకర సంకేతమని వారు హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణ రైతులకు కేంద్రం భారీ ఊరట

- రబీ ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంపు
- రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుంది
- మోదీ, ప్రహ్లాద్ జోషికి కృతజ్ఞతలు తెలిపిన లింగస్వామి గౌడ్



ప్రజా వాయిస్,మునుగోడు...తెలంగాణ రైతులకు భారీ ఊరట కలిగించేలా రబీ 2025–26 ధాన్యం సేకరణ అంచనాను 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సభ్యులు నకిరేకంటి లింగస్వామి గౌడ్ స్వాగతించారు. ఈ నిర్ణయం రాష్ట్ర రైతులకు ఎంతో ప్రయోజనకరమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర వినియోగ దారుల వ్యవహారాలు, ఆహార & ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం సేకరణ పరిమాణాన్ని పెంచడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శనమని అన్నారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని, రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించాలనే సంకల్పంతో మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని లింగస్వామి గౌడ్ పేర్కొన్నారు. ధాన్యం సేకరణ లక్ష్యం పెరగడం వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుం దని, పంట విక్రయంలో ఇబ్బందులు తగ్గడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయానికి తెలంగాణ రైతులు మద్దతుగా నిలుస్తారని లింగస్వామి గౌడ్ పేర్కొన్నారు.

# గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం

- రూ. 175 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన
- తాగునీటి సంరక్షణే ధ్యేయం – జూన్ వరకు ముందస్తు కార్యాచరణ
- 1977 కరువు ముప్పు? అప్రమత్తంగా ఉండాల్సిందే:
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు





**ప్రజా వాయిస్ ఖమ్మం:** త్రాగునీటిని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపుని చ్చారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి వి. వెంకటాయపాలెం డ్రాప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని మంత్రి నేరుగా పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. 1977లో వచ్చిన కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై ఉండే అవకాశముందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీని ప్రభావం పెరిగి భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని, త్రాగునీటి పరిరక్షణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రమై భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందన్న వాతావరణ నిపుణుల హెచ్చరికల దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు వరి, మిర్చికి బదులుగా తక్కువ నీటి అవసరమున్న ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.

గోదావరి జలాలను రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం జరుగుతోందని మంత్రి వివరించారు. మంచుకొండ ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపి, మున్నేరులోకి నీటిని తరలించి ఖమ్మం నగర తాగునీటి అవసరాలు తీరుస్తామన్నారు. సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని, సాంకేతిక సూచనలు అందించిన ఇంజినీర్లను ఆయన అభినందించారు. పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా, యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అలాగే పారదర్శకత కోసం ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్ ప్రవేశపెట్టిందని, రైతులు రాజకీయ ప్రేరేపిత ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, లభ్యతలో ఉన్న నీటిని పొదుపుగా వాడుతూ వచ్చే జూన్ వరకు తాగునీటి కొరత లేకుండా పక్కా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటి వరకు గోదావరి జలాలను వైరాకు తరలించామని, ప్రస్తుతం రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి గోదావరి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్ ను నింపే అవకాశాలను ఇంజినీర్లు, నిపుణులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అనంతరం ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇరిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# టేక్మాల్ మండల రోడ్లకు మహర్దశ

- మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నాయకులు
- రాహుల్ గాంధీని అరెస్ట్ చెయ్యడం అమానుషం

**ప్రజా వాయిస్ టేక్మాల్ :** టేక్మాల్ మండలం లోని రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.100 కోట్ల నిధులు కేటాయించిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ కృషికి కృతజ్ఞతగా బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నాయకులు ఘనంగా పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు..మండల ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదలకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ నిధులు ఎంతో ఉపయోగపడతాయని నాయకులు పేర్కొన్నారు.అనంతరం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తు రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇటీవల దేశవ్యాప్తంగా వెలుగుచూస్తున్న పరీక్షల పేపర్ లీకులు, ఎగ్జామ్ కరప్షన్ ఘటనలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్యని అన్నారు.ప్రజాస్వామ్య దేశంలో తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించింది. విద్యార్థుల న్యాయమైన ఆందోళనలను వినాల్సిన ప్రభుత్వం, వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యతను విస్మరించి బలప్రయోగానికి దిగడం అత్యంత దురదృష్టకరం. విద్యార్థులపై భాష్పవాయు గోళాలు ప్రయోగించడం, వారిని అణచివేయడానికి ప్రయత్నించడం ఖండించదగిన విషయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

# మిషన్ భగీరథ కార్మికులకూ కోటి రూపాయల ప్రమాద బీమా

- మంత్రులను కోరిన దుర్గం రఘునాథ్!



**ప్రజా వాయిస్ /హైదరాబాద్** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రమాద జీవిత బీమా పథకాన్ని... మిషన్ భగీరథ గ్రిడ్‌లో పనిచేస్తున్న O&M (ఆపరేషన్ & మెయింటెనెన్స్) కార్మికులకు కూడా వర్తింపజేయాలని తెలంగాణ మిషన్ భగీరథ O&M కార్మిక సమితి గౌరవ అధ్యక్షులు దుర్గం రఘునాథ్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు ఆయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అలాగే పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్‌లను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ వినూత్న ప్రమాద బీమా పథకం ద్వారా, ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబాలకు రూ. 1 కోటి వరకు ఆర్థిక భద్రత లభిస్తోంది.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులతో పాటు బ్యాంకు ఖాతాల ద్వారా ప్రభుత్వ వేతనం పొందుతున్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది.ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో మిషన్ భగీరథ O&M కార్మికులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది ప్రాణాపాయం ఉండే ఫీల్డ్ డ్యూటీలు, సంపుల్లో విధులు నిర్వహిస్తున్నందున, వారికి కూడా ఈ బీమా రక్షణ కల్పించడం ఎంతో న్యాయసమ్మతమని దుర్గం రఘునాథ్ వినతిపత్రంలో పేర్కొన్నారు.వినతిపత్రంపై ఇద్దరు మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు దుర్గం రఘునాథ్ తెలిపారు. మిషన్ భగీరథ O&M కార్మికులను ప్రమాద జీవ బీమా పథకం పరిధిలోకి తీసుకువచ్చే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తగిన సానుకూల చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న కార్మికుల ప్రాణ భద్రతకు ప్రభుత్వం మరింత బలమైన భరోసా కల్పిస్తుందనే ఆశాభావాన్ని ఈ సందర్భంగా ఆయన వ్యక్తం చేశారు



# మీసేవ ద్వారా పోచన్నపేట వాగు ఇసుక బుకింగ్స్ ఆపాలి

- పోచన్నపేట గ్రామం ప్రస్తుతం త్రీవ కరువు ప్రాంతంగా ఉంది
- దీనివల్ల గ్రామంలో త్రాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది
- బావులు బోర్లు పూర్తిగా ఎండిపోయి రైతంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.
- తహశీల్దార్ కు గ్రామస్థుల విజ్ఞప్తి

**ప్రజా వాయిస్/జనగామ** (బచ్చన్నపేట) బచ్చన్నపేట మండల పరిధిలోని పోచన్నపేట గ్రామ వాగు నుండి మీసేవ (MeeSeva) పోర్టల్ ద్వారా ఇసుక రవాణా కు సంబంధించిన స్లాట్ బుకింగ్స్ ఇవ్వడాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ గ్రామస్థులు బుధవారం బచ్చన్నపేట మండల తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు.పోచన్నపేట గ్రామం ప్రస్తుతం తీవ్ర కరువు ప్రాంతంగా ఉందని గ్రామస్థులు ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో మీసేవ లో స్లాట్ పర్మిషన్లు ఇస్తూ వాగు నుండి నిరంతరాయంగా ఇసుకను తరలించడం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడటమే కాకుండా, వ్యవసాయ బావులు, బోర్లు పూర్తిగా ఎండిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం కరువు పీడిత ప్రాంతాల్లోని వనరులను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, కాబట్టి పోచన్నపేట వాగును మీసేవ ఇసుక బుకింగ్స్ పరిధి నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్థులంతా కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, యువకులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# హాస్పిటల్‌పై కక్ష... బోర్డుపై ప్రతీకారం!

- బాలాజీ హాస్పిటల్ బ్యానర్ చింపివేత కలకలం
- ప్రజలకు సమాచారం అందించే బోర్డును ధ్వంసం చేసిన దుండగులు
- నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై భరత్ భూషణ్ హామీ




**ప్రజావాయిస్/ మోమిన్‌పేట్:** మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న బాలాజీ హాస్పిటల్ ఇటీవల కొత్త భవనానికి మారింది. పాత భవనం యజమానితో లీజు ఒప్పందం గడువు ముగియడంతో, మరో రెండేళ్లు లీజును కొనసాగించాలని డాక్టర్ నారాయణరెడ్డి కోరినప్పటికీ భవన యజమాని అంగీకరించలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమీపంలోని మరో భవనాన్ని అద్దెకు తీసుకుని ఆసుపత్రిని అక్కడికి తరలించారు.రోగులు కొత్త ప్రదేశాన్ని సులభంగా గుర్తించేందుకు పాత భవనం ముందు "బాలాజీ హాస్పిటల్ కొత్త భవనానికి మార్చబడింది" అనే సమాచార బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. అయితే గుర్తుతెలియని వ్యక్తి కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఆ బ్యానర్‌ను చింపివేయడం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.ఈ ఘటనపై డాక్టర్ నారాయణరెడ్డి మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్సై భరత్ భూషణ్ మాట్లాడుతూ, బ్యానర్‌ను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ ఘటనపై రోగులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు దారి చూపే సమాచార బోర్డును కూడా ధ్వంసం చేయడం దురుద్దేశపూరిత చర్య అని మండిపడ్డారు. వ్యక్తిగత కక్షల కోసం వైద్య సేవలను అడ్డుకునే ప్రయత్నాలు చేయడం సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు పోలీసులను కోరుతున్నారు.

# జోడేఘాట్‌లో కుమురం భీమ్‌కు డీటీడీఓ నివాళులు

- ఆశ్రమ పాఠశాల తనిఖీ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమేరి మండలం జోడేఘాట్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీఓ) జాదవ్ అంబాజీ బుధవారం పర్యటించారు. చారిత్రాత్మక జోడేఘాట్‌లోని అమరవీరుడు కొమరం భీమ్ స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కుల కోసం కొమరం భీమ్ సాగించిన పోరాటం, చేసిన త్యాగాలు నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా తెలియజేశారు.గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు డీటీడీఓకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామస్తులు కోరారు.అనంతరం జోడేఘాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, తరగతి గదులు, వసతి గృహం, భోజనశాల, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యాభ్యాసం, ఆరోగ్యం, భోజన నాణ్యత, వసతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏటీడీఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్యూరేటర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# రివ్యూ లేని ప్రజావాణి కార్యక్రమం?

- దరఖాస్తుల లెక్క సరే... పరిష్కరించని వాటి లెక్కేది!
- పనులు మానుకొని ఆఫీసుల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- పరిష్కారంలో జాప్యం జరిగితే పట్టించుకునేది ఎవరు!
- నిర్లక్ష్యపు అధికారుల తీరు పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో**: తెలంగాణలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు.అయితే అందులో భాగంగానే వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారు. మీ భూమికి సంబంధించిన అన్ని పత్రాలు జతచేసి నేరుగా అధికారులకు దరఖాస్తు చేసుకుంటారు.అయితే ప్రతివారం వందకు పైగా దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి, అందులో ఎక్కువగా గతంలో ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కానీ కారణంగా మళ్లీ ఫిర్యాదు చేసేందుకు వస్తున్న పరిస్థితి.ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'ప్రజావాణి'లో అర్జీలు స్వీకరిస్తున్నప్పటికీ, వాటిపై సరైన 'రివ్యూ' (సమీక్ష) జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. అర్జీలు వేల సంఖ్యలో వస్తున్నప్పటికీ, కింది స్థాయి వరకు అవి చేరడం లేదని, పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోంది.అయితే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరిగితే అధికారులను బాధ్యులను చేసేలా, రాష్ట్ర, జిల్లా స్థాయిలో రియల్ టైమ్ మానిటరింగ్ (డ్యాష్‌బోర్డ్) విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం అందరికీ తెలిసిందే.కానీ ప్రజావాణిలో ఫిర్యాదు చేసి నెలలు గడిచిన సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని పలువురు ఫిర్యాదుదారులనుండి అసహనం వ్యక్తం అవుతుంది.



## దుద్దిళ్ల పాలనలో పోలీసులకు అవమానాలే

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**ప్రజా వాయిస్ రామగిరి** మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారంలోకి వచ్చినప్పుడల్లా పోలీసులకు, ఖాకీ యూనీఫామ్‌కు అవమానాలే ఎదురవుతున్నాయని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. నాగేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజాసమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు పూదరి సత్యనారాయణ గౌడ్‌పై కావాలనే 20కి పైగా అక్రమ కేసులు పెట్టారని, ఆయన కుటుంబసభ్యులపై కూడా నీచమైన రీతిలో కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. దుద్దిళ్ల చెప్పినట్లు వింటూ పోలీసులు ప్రవర్తించడం వల్లే హైకోర్టులో చివాట్లు తినాల్సి వస్తోందని, నిందితులను పట్టుకోలేకపోతున్నారంటూ అధికారులను మంత్రి తీవ్రంగా దూషిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో రాజ్యాంగానికి విరుద్ధంగా కక్షసాధింపు చర్యలు దిగుతున్నారని, సొంత ఊరిలో అభివృద్ధిని కూడా పట్టించుకోకుండా విఫలమయ్యారని విమర్శించారు. పోలీసులు దుద్దిళ్ల కుటుంబానికి బానిసలుగా మారకుండా, రాజ్యాంగానికి కట్టుబడి న్యాయంగా పనిచేయాలని హితవు పలికారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఈ అక్రమ కేసులపై రివ్యూ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాళేశ్వరం మొదలైతే 'బ్యాక్ వాటర్' వల్ల ముప్పేనా?

- మంథని ప్రజల్లో పెరిగిన ఆందోళన
- సుందరీకరణపై ఉన్న శ్రద్ధ వరద నివారణపై ఏది?
- మంథనికి మళ్లీ అదే గండమా?
- నాలుగేళ్లు దాటినా మారని వరద భయం!
- అధికారుల నిర్లక్ష్యంపై మంథని ప్రజల ఆగ్రహం!

**ప్రజా వాయిస్ మంథని** పట్టణానికి అత్యంత కీలకమైన వరద ముంపు నివారణ చర్యలను పక్కనపెట్టి, ప్రజాధనాన్ని కేవలం సుందరీకరణ పనులకే వెచ్చిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేసిన రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేయడం, ఉన్న భవనాల స్థానంలో కొత్తవి నిర్మించడం, వేజ్-నాన్ వేజ్ మార్కెట్లు, 90 ఫీట్ల రహదారి వెడల్పు పనులపై ఉన్న శ్రద్ధ.. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే బొక్కల వాగు ముంపు పరిష్కారంపై పెట్టకపోవడం గమనార్హం. జూలై 2022లో 'మంత్రపురి మదిలో విషాద ఘట్టం' అంటూ రూ. 100 కోట్లకు పైగా ఆస్తి నష్టాన్ని మిగిల్చిన భయానక వరదలు వచ్చి నాలుగేళ్లు గడిచినా, మంథని పట్టణ ప్రజల వరద కష్టాలు మాత్రం తీరలేదు. నాటి క్షేత్రస్థాయి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, భవిష్యత్తులో వరదలు రాకుండా శాశ్వత పరిష్కారాలు చూపుతారని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ప్రజా పాలన మొదలై 32 నెలలు గడుస్తున్నా.. నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులు వరద నివారణకు ఎలాంటి నూతన ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవడంపై పట్టణవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**సాంకేతిక లోపాలు — ఇంజనీరింగ్ వైఫల్యం:**

కొత్తగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంలో తీవ్ర సాంకేతిక లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. చిన్న సైజు పైపులు వేయడం వల్ల చిన్నపాటి వర్షానికే పలు వార్డుల్లో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు అల్లాడిపోతున్నారు.అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నప్పటికీ, ముందుగా పట్టణానికి ఉన్న వరద ముప్పును నివారించేలా అధికారులు, పాలకు చర్యలు చేపట్టాలని మంథని ప్రజలు కోరుతున్నారు. విశ్లేషణ అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రంగుల వెలుగులు మాత్రమే కాదు.. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలకు రక్షణ కల్పించడమే నిజమైన ప్రజా పాలన.

**నగర ప్లానింగ్ & విజన్ లోపించడం:**

ఏ పట్టణానికైనా డ్రైనేజీ వ్యవస్థ మరియు వరద నీటి కాలువలు ప్రాథమిక అవసరం. కానీ మంథనిలో నిర్మాణంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో సాంకేతిక పరిజ్ఞానం లోపించడం, చిన్న సైజు పైపులు వాడడం వల్ల భవిష్యత్తులో మరింత ప్రమాదం పొంచి ఉంది. వరద కాలువల సామర్థ్యాన్ని పెంచకుండా సుందరీకరణ పనులు చేపడితే, చిన్న వర్షానికే ఆ పనులన్నీ నీట మునిగి ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

**కారణాలపై అధ్యయనం కాకపోవడం:**

2022 వరదలకు ప్రధాన కారణం చెక్ డ్యామ్ నిర్మాణం మరియు బొక్కల వాగు పొంగి పొర్లడమే. నాలుగు సంవత్సరాలు గడిచినా ఈ సమస్యకు సాంకేతిక పరిష్కారం ఏంటో కనుగొనేందుకు ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం చేయకపోవడం అధికారుల, పాలకుల అలసత్వానికి అద్దం పడుతోంది.

**ప్రజా ప్రాధాన్యతల తలకిందులు:**

ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల్లో చాలా వరకు 'కంటికి కనిపించే' మార్పులకే ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప, 'అత్యవసరమైన' సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించడం లేదు. రోడ్ల వెడల్పు, సుందరీకరణ అవసరమే అయినా.. వరదలు వచ్చినప్పుడు అవి రూపాయి కూడా ఉపయోగపడవు. మంథని పట్టణ ప్రజల భయాలను తొలగించాలంటే నీటిపారుదల శాఖ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి. బొక్కల వాగు వరద నీరు సులభంగా మళ్లించేలా రిటైనింగ్ వాల్స్, పెద్ద సైజు డ్రైనేజీ పైప్‌లైన్లు, శాస్త్రీయ నీటి నిర్వహణ చేపట్టినప్పుడే మంత్రపురి ప్రజలకు ఈ కన్నీటి వరదల నుండి శాశ్వత విముక్తి లభిస్తుంది.



మంథని శ్రీపాద చౌక్ లో!

## ఆర్టీసీ హైర్ బస్సులకు డ్రైవర్ల నియామకం

- కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల అభ్యర్థులకు ఉపాధి అవకాశం

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో ఆర్టీసీ హైర్ బస్సులను నడిపేందుకు డ్రైవర్ల నియామకం చేపడుతున్నట్లు ఉమ్మడి కరీంనగర్ హైర్ బస్ యాజమానుల సంఘం ప్రతినిధులు వర్ణ మల్లారెడ్డి, తాళ్లపల్లి మనోజ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 18 నెలల హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. గతంలో స్కూల్ బస్సులు లేదా లారీలు నడిపిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.ఎంపికైన డ్రైవర్లకు 15 రోజుల డ్యూటీ విధానం, ఆకర్షణీయమైన వేతనంతో పాటు అదనపు డ్యూటీలు నిర్వహిస్తే ప్రత్యేక అలవెన్స్ కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు.ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా ఫోన్ ద్వారా సంప్రదించి తమ



పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ జూలై 31, 2026గా నిర్ణయించారు.సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 1).వర్ణ మల్లారెడ్డి – 96406036782).తాళ్లపల్లి మనోజ్ గౌడ్ – 9849516271

## నీళ్లు లేవు..నిర్లక్ష్యమే కనిపిస్తోంది

- నిడమనూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 10 రోజులుగా తాగునీటి కష్టాలు
- బకెట్లతో మూడో అంతస్తుకు నీళ్లు మోస్తున్న విద్యార్థినులు
- సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్.



**నల్గొండ క్రైమ్ / ప్రజా వాయిస్:** నిడమనూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్య తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత పది రోజులుగా తాగునీరు అందుబాటులో లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆరోపించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈసందర్భంగా విద్యార్థినులు తాగునీటితో పాటు స్నానం, మరుగుదొడ్లు వంటి కనీస అవసరాలకూ నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కింద అంతస్తు నుంచి బకెట్లతో మూడో అంతస్తు వరకు నీటిని మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య కారణంగా చదువుతో పాటు వారి ఆరోగ్యంపైనా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.ఈవిషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని నోముల భగత్ కుమార్ విమర్శించారు. జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసినా స్పందన లేదని, బాలికల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించాలని, సంబంధిత అధికారులతో తక్షణమే తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో లకుమాల మధుబాబు, లకుమాల లింగయ్య, సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్, రాయనబోయిన రామలింగయ్య, లక్ష్మణ్, మొహమ్మద్ తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో జర్నలిస్టుల కోసం కేటాయించిన జాగా కబ్జా

- ప్రభుత్వ అధికారుల కనుసన్నల్లోనే దర్జాగా భూకబ్జాలు
- జర్నలిస్టుల స్థలాలని కాపాడాలని విప్లవ కార్మిక సంఘాల డిమాండ్!

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలములోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో హైవే రోడ్డు ప్రక్కన జర్నలిస్టులకు కేటాయించిన భూమిని కొంతమంది భూ కబ్జాదారులు, వారికి ఉన్న అండదండలతో జర్నలిస్టుల కాలనీలను కూడా కబ్జా చేస్తున్నారు. కన్నాల గ్రామ పంచాయితీ ఏరియాలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. ఈ ప్రభుత్వ భూమిని కొంతమంది అధికార బలంతో వెంచర్లు వేసి అమ్ముకుంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా శాసనసభ్యులు మరియు రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని జర్నలిస్టుల కాలానిలని కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం. మరియు ఫుడ్ ప్రాసెసింగ్ ఏరియా కూడా భూ కబ్జా జరుగుతున్నది. రెవెన్యూ శాఖ ఎన్ని బోర్డులు పెట్టిన రాత్రికి రాత్రి మాయం చేసి తెల్లవారేసరికి సింగిల్ రూమ్ లు నిర్మిస్తున్నారు. దీన్ని బట్టి అర్థమవుతుంది. ఎవరి ప్రోత్సాహంతో నిర్మిస్తున్నారో ప్రజలందరికీ అర్థమవుతుంది. కాబట్టి ఇప్పటికైనా ఎమ్మెల్యే అలాగే రెవెన్యూ శాఖ అధికారులు జర్నలిస్టుల కాలనీని జర్నలిస్టులకు కేటాయించి మిగతా ప్రభుత్వ భూమిని ఇండ్లు లేని వారికి ఇల్లు కేటాయించాలని విప్లవ కార్మిక సంఘాలుగా మేము డిమాండ్ చేస్తున్నాం. అలాగే భూ కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం. లేని పక్షంలో జరుగబోయే ఆందోళన కార్యక్రమాలకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నాం. ఈ యొక్క కార్యక్రమంలో టి. మని రామ్ సింగ్ (టీఎన్టీయుసి ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అంబాల మహేందర్(ఎస్ జీ కె ఎస్ ) సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, యం.పోచ మల్లు (ఏఐఎఫ్టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోగర్ల శంకర్ (టి యు సి ఐ) నాయకులు పాల్గొన్నారు.



## హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు

- ముగ్గురికి జరిమానా
- నిబంధనలు ఉల్లంఘిస్తే హోటళ్లు సీజ్
- మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్** సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్ పురపాలక సంఘం పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత లోపాలపై బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ పాలకవర్గం సూచనలు, కమిషనర్ ఆదేశానుసారం శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.తనిఖీ బృందం పలు హోటళ్ల వంటగదులను, అక్కడ నిల్వ చేసిన ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా పరిశుభ్రత లోపాలు, నాణ్యతా ప్రమాణాలు పాటించని విషయం గుర్తించి సంబంధిత సంస్థలపై జరిమానాలు విధించారు.జరిమానా విధించిన సంస్థలు:వారాహి ధాబా – రూ. 3,000/-దుర్గాభవాని ధాబా – రూ. 2,000/-అభిరుచి ఫ్యామిలీ రెస్టారెంట్ – రూ. 1,000/-పురపాలక సంఘం ఈ చర్యల ద్వారా, ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే విధంగా హోటళ్లు, రెస్టారెంట్లు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని స్పష్టం చేసింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు, నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## పోగొట్టుకున్న నగదును అప్పగించిన పస్రా పోలీసులు

- ఎస్సై తాజుద్దీన్ నిజాయితీకి ప్రజల ప్రశంసలు.

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా:** పస్రా, 22 జూలై./మానవత్వం, నిజాయితీకి నిదర్శనంగా పస్రా పోలీసులు వ్యవహరించారు. కన్నాయిగూడెం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సోయం వీరబాబు ప్రమాదానికి గురైన సమయంలో ఆయన వద్ద ఉన్న రూ.9,700 నగదు రోడ్డుపై పడిపోయింది. విధి నిర్వహణలో ఉన్న పస్రా ఎస్సై తాజుద్దీన్, పోలీసు సిబ్బంది మధుకర్ నగదును గుర్తించి భద్రపరిచారు. అనంతరం విచారణ నిర్వహించి, ఆధారాల ద్వారా నగదు బాధితుడిదేనని నిర్ధారించి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. పోగొట్టుకున్న సొమ్ము తిరిగి అందుకోవడంతో సోయం వీరబాబు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసుల సేవాభావాన్ని అభినందించారు."ప్రజల ఆస్తిని ప్రజలకే భద్రంగా చేర్చడం పోలీసుల బాధ్యత" అనే సందేశాన్ని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. పస్రా పోలీసుల నిజాయితీ, సేవా తత్వాన్ని స్థానికులు కొనియాడారు.



## ఆగస్టు 10న మంథని అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి 'మీడియా స్వర్ణోత్సవాలు'

**ప్రజా వాయిస్ మంథని** ఆగస్టు 10వ తేదీన నిర్వహించనున్న మంథని అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మీడియా స్వర్ణోత్సవాలను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కార్యక్రమ వ్యవహర్త కొండేల మారుతి, సమన్వయకర్త నారమల్ల కృష్ణ విజ్ఞప్తి చేశారు. మంథని విద్యార్థి యువత వేదికగా ఉత్సవాల గోడపత్రికను (పోస్టర్) వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంథని విలేకరుల రంగంలో 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్న సీనియర్ జర్నలిస్టులకు రజతోత్సవ బహుకృతి మెమోంటోలతో సత్కరిస్తామని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ (టీవీ ఛానల్స్), సోషల్ మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ప్రశంస పత్ర పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకకు మంథనికి చెందిన రాష్ట్ర స్థాయి జర్నలిస్టులను, నియోజకవర్గంలోని వివిధ గ్రామీణ, మండల స్థాయి రిపోర్టర్లను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. జర్నలిజం రంగంలో విశేష అనుభవం ఉన్న రాష్ట్ర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ప్రజాహిత వార్తల ప్రాధాన్యతను చాటి చెప్పేలా నిర్వహించే ఈ మంథని మీడియా స్వర్ణోత్సవ వేడుకలను అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.




## స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి ప్రజా సంఘాల నాయకులు పిలుపు

**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా** స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు ఎఫ్ టి ఏ ఎస్ కు వ్యతిరేకంగా వనపర్తి జిల్లా కేంద్రంలో సంయుక్త కిసాన్ మార్చ్ ఆధ్వర్యంలో పాత మార్కెట్ ఎదురుగా రోడ్డుపై రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకోవడం జరిగింది, దీనిపై నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి, సిఐటీయు జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు మాట్లాడుతూ భారత ప్రభుత్వం అమెరికా, యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్, న్యూజిలాండ్ తదితర దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఎఫ్ టి ఏ ఎస్ భారత వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, పాడి పరిశ్రమ, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు, సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమలు మరియు దేశ ఆహార భద్రతకు తీవ్రమైన ముప్పు అని వారన్నారు.భారీ సబ్సిడీలు పొందిన విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు భారత మార్కెట్‌ను ఆక్రమించడం, దేశీయ పంటలకు గిట్టుబాటు ధరలు పడిపోవడం, రైతుల జీవనోపాధి నాశనం కావడం, విత్తనాలపై బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యం పెరగడం, నిరుద్యోగం అధికమవడం వంటి పరిణామాలను మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. రానున్న రోజుల్లో ఈ ఒప్పందాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున రైతులను సమీకరించి పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి, సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల రాజు, వ్యవసాయ కామిక్ సంఘం జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్, ప్రజా సంఘాల నాయకులు డి కురుమయ్య, ముత్యాలు, బాలస్వామి, మద్దిలేటి, వెంకటేష్, రాజు, వెంకన్న, రాజశేఖరకార్మికులు, రైతులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి

- పీసీఆర్, పీఓఏ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**ప్రజా వాయిస్ సంగారెడ్డి:** పీసీఆర్, పీఓఏ చట్టాలను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం, పీసీఆర్, పీఓఏ చట్టాల అమలుపై సమీక్షా సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో చోటుచేసుకునే ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అట్రాసిటీ ఘటనలను అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి రాని వాస్తవ ఘటనలను రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించి, వాస్తవమైన ప్రతి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. బాధితులకు చట్టప్రకారం అందాల్సిన రక్షణ, సహాయం, ఆర్థిక ఉపశమనం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆర్డీవోలకు ఆదేశించారు. 2022 నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 144 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఆర్థిక ఉపశమనం కింద సుమారు రూ.2.58 కోట్ల నిధులు అవసరమవగా, ఇప్పటివరకు రూ.1.74 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 37 మంది బాధితులకు రూ. 68,87,500/- విడుదల చేసినట్లు, మిగిలిన అర్హులైన బాధితులకు ఆర్థిక ఉపశమనం అందజేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు వివరించారు. సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై జిల్లా కలెక్టర్ డీఎస్పీలను కేసుల వారీగా వివరాలు అడిగి తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారా అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని అన్నారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, 2026 జూన్ నెలాఖరు వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 31 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అందులో 12 కేసులు దర్యాప్తు దశలో ఉండగా, 19 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రతి కేసులో బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తూ, చట్టప్రకారం సత్వర న్యాయం అందేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, ఏసీపీలు, డీఎస్పీలు, రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేందర్, దేవుజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.a



## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అన్యాయం

- మందమర్రి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మహిళల బైఠాయింపు

**ప్రజా వాయిస్ /మంచిర్యాల్ క్రైమ్** మందమర్రి పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ కలకలం రేపింది. అర్హత ఉండి కూడా తమ పేర్లు జాబితాలో గల్లంతు కావడంతో నిరుపేద మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మండల పరిధిలోని మందమర్రి మరో కార్యాలయం ఎదుట 19వ వార్డుకు చెందిన పలువురు మహిళలు గురువారం బైఠాయించి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు.బాధిత మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. తాము అన్ని అర్హతలు కలిగి ఉండి, నిబంధనల ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మొదట విడుదల చేసిన అర్హుల జాబితాలో తమ పేర్లు వచ్చాయని, కానీ ఆ తర్వాత వచ్చిన తుది ఇళ్ల కేటాయింపు జాబితాలో తమ పేర్లు మాయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయ లబ్ది కోసం అర్హులకు అన్యాయం చేస్తున్నారని మహిళలు మండిపడ్డారు. పూటగడవని నిరుపేదలమైన తమకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు.ఈ ఆందోళనతో ఎమ్మార్వో కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు.



# ప్రతి జర్నలిస్టుకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందజేయాలి

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి
- షాబాద్ మండల టీయూడబ్ల్యూజే నూతన అధ్యక్షుడిగా దర్పల్లి రవీందర్ గౌడ్ ఎన్నిక

**(ప్రజా వాయిస్ షాబాద్)**షాబాద్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే సంయుక్త విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీం పాషా ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ..సమాజ శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారుజర్నలిస్టుల ప్రధాన డిమాండ్లైన అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రెడిటేషన్ కార్డుల మంజూరు, కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డుల పునరుద్ధరణ, కుటుంబాలకు భరోసానిచ్చే గ్రూప్ ఇన్సూరెన్స్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు ఈ డిమాండ్లు నెరవేరే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు జర్నలిస్టులంతా విభేదాలు వీడి ఒకే తాటిపైకి వచ్చి యూనియన్‌ను మరింత బలోపేతం చెయ్యాలని తెలియజేశారు మరియు మండల స్థాయి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు స్థానిక సమస్యల పరిష్కారంపై త్వరలో జిల్లా కలెక్టర్ సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులపై ఎక్కడైనా దాడులు లేదా అక్రమ కేసులు నమోదైతే యూనియన్ తీవ్రంగా స్పందించి లీగల్ సెల్ ద్వారా పూర్తి న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు అలాగే ప్రతి నియోజకవర్గంలో జర్నలిస్టుల కోసం హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో చేవెళ్ల నియోజకవర్గంలో హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. షాబాద్ మండల టీయూడబ్ల్యూజే నూతన అధ్యక్షుడిగా దర్పల్లి రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏగూరి మల్లికార్జున్, రవీందర్ గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా నాగని రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా కడమంచి నర్సింలు, ఉప్పు శ్రీనివాస్, పోనమోని వెంకటేష్ యాదవ్, జాయింట్ సెక్రటరీలుగా బర్క నరేందర్, ముక్కు లక్ష్మణ్, జానంపేట శివరాజ్ గౌడ్, కోశాధికారిగా పూర్ణ చందర్ గుప్తా, ఈసీ మెంబర్లుగా చిలకమర్రి అనిల్, రాజేష్, మధు, రాజేందర్, రవి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులని కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శులు దారుగుపల్లి సత్యనారాయణ, సూర్యనారాయణ, రమేష్,ఈసీ సభ్యులు ఇలియాజ్ షరీఫ్,చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డిమోని యాదయ్య, షాబాద్ మండల మాజీ అధ్యక్షుడు పోనమోని రమేష్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి, కరుణాకర్ చారి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## పైలట్ ఎంట్రీకి హైకోర్టు గ్రీన్ సిగ్నల్..!

- ట్రయల్ కోర్టు పరిధి వీడరాదన్న షరతుకు హైకోర్టు సడలింపు
- త్వరలో ప్రజల్లోకి మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి
- బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త జోష్.



**ప్రజా వాయిస్/తాండూర్:** తాండూర్ నియోజకవర్గ ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న పరిణామానికి తెరపడింది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు కీలక ఊరట కల్పించింది. ట్రయల్ కోర్టు ముందస్తు అనుమతి లేకుండా కోర్టు పరిధిని వీడరాదన్న బెయిల్ షరతును సడలిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చాలా కాలంగా ప్రజలకు దూరంగా ఉన్న పైలట్ రోహిత్ రెడ్డి త్వరలోనే తాండూర్ నియోజకవర్గంలో అడుగుపెట్టనున్నారని బీఆర్ఎస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.పైలట్ రోహిత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, దర్యాప్తులో కీలక దశ ఇప్పటికే పూర్తయిందని పిటిషనర్ తరపు న్యాయవాది చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకుంది. తన సొంత నియోజకవర్గంలో ప్రజలను కలిసేందుకు అవకాశం కల్పించాలని కోరగా, కోర్టు ట్రయల్ కోర్టు పరిధి వీడరాదన్న షరతును సడలించింది. అయితే మిగిలిన అన్ని బెయిల్ షరతులు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసినట్లు సమాచారం.ఈ తీర్పుతో తాండూర్ నియోజకవర్గంలో రాజకీయ చర్చలు మళ్లీ ఊపు అందుకోనున్నాయి. ఈ మేరకు, తమ నాయకుడు ప్రజల్లోకి రావాలని ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే పైలట్ రోహిత్ రెడ్డి ప్రజలను కలిసి నియోజకవర్గ పర్యటనలు ప్రారంభించే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## హనుమకొండలో 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం

- విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోంది
- మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** దేశ భవిష్యత్తును నిర్మించే యువతకు నాణ్యమైన విద్య, పారదర్శకమైన పరీక్షా విధానం, సమాన అవకాశాలను కల్పించడం కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని, అయితే కేంద్ర ప్రభుత్వం ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు.హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కిషన్ పుర లో నిర్వహించిన "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ,శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి, అయూబ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, విద్యార్థులు, యువజన ప్రతినిధుల కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, రీ-ఎగ్జామ్స్ వంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటూ లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర ఆందోళన, మానసిక వేదనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు నెలల తరబడి, సంవత్సరాల తరబడి కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, చివరికి ప్రశ్నాపత్రాల లీకుల కారణంగా వారి కృషి వృథా కావడం అత్యంత బాధాకరమని అన్నారు.NEET-UG 2026 పరీక్ష రద్దు దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర అనిశ్చితిని సృష్టించిందని, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు, అనంతరం వెలుగులోకి వచ్చిన ఆరోపణలు పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేశాయని పేర్కొన్నారు. ఈ ఘటనల నేపథ్యంలో అనేక మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడిన విషాద ఘటనలు దేశాన్ని కలచివేశాయని అన్నారు.ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, బాధ్యులపై చర్యలు తీసుకునే బదులు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మండిపడ్డారు."విద్యార్థులు శాంతియుతంగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడితే వారిపై అమానుషంగా లాఠీలు ఎత్తడం అత్యంత దురదృష్టకరం. ఒకప్పుడు స్వాతంత్ర్య ఉద్యమంలో 'మమ్మల్ని కొట్టండి, దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వండి' అని పోరాడిన యువత చరిత్రను మనం చదివాం. నేడు 'మమ్మల్ని కొట్టండి కానీ మాకు న్యాయం చేయండి' అని విద్యార్థులు దెబ్బలు తింటున్న పరిస్థితి రావడం బాధాకరం అన్నారు.విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి నిరసనగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలు శాంతియుత నిరసన చేపట్టగా, వారిని బలవంతంగా ఈడ్చుకుంటూ వెళ్లి అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.పార్లమెంట్‌లో NEET పేపర్ లీకేజీ అంశంపై సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం ప్రజల అనుమానాలను మరింత పెంచుతోందన్నారు. దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాల్సిన ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్‌లో బీజేపీ నాయకులు ర్యాలీలు నిర్వహిస్తున్నారని, అయితే ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి మద్దతుగా ర్యాలీలు చేస్తున్నారా? లేక కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయొద్దని ర్యాలీలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు.తన రాజకీయ ప్రస్థానం కూడా విద్యార్థి నాయకుడిగానే ప్రారంభమైందని గుర్తు చేసుకున్న మంత్రి, విద్యార్థి ఉద్యమాల నుంచే ప్రజాసేవలోకి వచ్చానని చెప్పారు. విద్యార్థి శక్తి ఎన్నో చారిత్రక మార్పులకు కారణమైందని, దేశ భవిష్యత్తును మార్చే శక్తి యువత చేతుల్లోనే ఉందన్నారు.రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ యువతతో కలిసి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.గత పదేళ్లలో దేశవ్యాప్తంగా అనేక ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షలు వివాదాల్లో చిక్కుకోవడం వల్ల యువతలో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. పరీక్షా వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటే దేశ భవిష్యత్తుకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు.యువత కష్టపడి చదివి సాధించిన ప్రతిభకు విలువ దక్కేలా పారదర్శకమైన, నిష్పక్షపాతమైన, భద్రమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ సంస్కరణలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.దేశ యువత కలలను కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని, వారి ఆశలను చిదిమివేసే వ్యవస్థ కాదు, వారి ప్రతిభను గుర్తించి సమాన అవకాశాలు కల్పించే పాలన దేశానికి అవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

## కొరట్లగూడెంలో డంపర్ బీభత్సం

- తృటిలో తప్పిన భారీ ప్రమాదం
- పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు
- మట్టి, ఇసుక వ్యాపారుల దూకుడు
- మౌనంగా చూస్తున్న అధికార యంత్రాంగం?



**ప్రజా వాయిస్ ఖమ్మం:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం, కొరట్లగూడెం గ్రామంలో బుధవారం సాయంత్రం భారీ ప్రమాదం తృటిలో తప్పింది. మట్టి రవాణా చేస్తున్న ఓ డంపర్ ఇరుకైన గ్రామ రోడ్డుపై అదుపుతప్పి పక్కకు ఒరగడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. లారీ పక్కనే నివాస గృహం ఉండటంతో మరికొద్దిలోనే పెద్ద విషాదం చోటు చేసుకునేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టంగా భావిస్తున్నారు.నేలకొండపల్లి మండలంలో మట్టి, ఇసుక రవాణా రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, భారీ డంపర్లు, అక్రమ ఇసుక ట్రాక్టర్లు అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా గ్రామ రహదారులపై యథేచ్ఛగా తిరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరుకైన రోడ్లపై మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్న ఈ వాహనాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని, చిన్నారులు, వృద్ధులు రోడ్లపై నడవాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈరోజు జరిగిన ఘటన ఒక హెచ్చరిక మాత్రమేనని, ఇప్పటికైనా అధికారులు అక్రమ మట్టి, ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుని, గ్రామాల్లో భారీ వాహనాల వేగాన్ని నియంత్రించకపోతే ఎప్పుడైనా పెద్ద విషాదం జరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## దేశంలో కల్లోలం సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్

**జా వాయిస్ దుబ్బాక** విదేశీ శక్తులతో చేతులు కలిపి దేశంలో అల్లర్లు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోడీ నివాసాన్ని ముట్టడించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈరోజు దుబ్బాకలో మున్సిపల్ అధ్యక్షుడు గొల్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ మాట్లాడుతూ ఒకపక్క పార్లమెంటు సమావేశాలు జరుగుచుండగా ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ పార్లమెంటులో చర్చలో పాల్గొనకుండా దేశంలో కల్లోలం సృష్టించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నివాసాన్ని ముట్టడించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు.ప్రపంచ దేశాలలో భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టకు, భారత దేశ ప్రతిష్టకు భంగం కలిగించేలా దేశంలో అంతర్గతంగా అల్లర్లు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ కొంతమంది దేశ వ్యతిరేక శక్తులతో కలిసి పని చేస్తూ దేశంలో అల్లర్లు సృష్టిస్తుందని అన్నారు.ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై ప్రతి పౌరుడు ఆలోచించాలని,పేపర్ లీక్ వంటి ఘటనలు జరిగితే వాటిపై నిష్పక్షపాత విచారణ జరగడానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని దీనిపై భిన్నాభిప్రాయాలకు తావు లేదని అన్నారు.అయితే, ఏ నిరసన అయినా శాంతియుతంగా, చట్టబద్ధంగా జరగాలని, హింస, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, భద్రతా సిబ్బందిపై దాడులు లేదా ప్రజల్లో ఉద్రిక్తతలు పెంచే చర్యలు జరిగితే, వాటిని ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఇలాంటివి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, కాక్రోచ్ జనతా పార్టీ ఇలాంటి పార్టీలకు ప్రభుత్వం తగిన విధంగా బదిలిస్తుందని అన్నారు.



హన్మకొండలో నిరసన తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ, ఎమ్మెల్సీ. ఎమ్మెల్యేలు



కోరుట్లలో భారీ రాస్తారోకో.. ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం




నీట్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టమైంది.*
పైడాకుల అశోక్.ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు.



లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న
తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి.



అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు నిరసన ధర్నా..
మాజీ మంత్రి జహీరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఏ. చంద్రశేఖర్



హుజుర్నగర్ లో నిరసన వ్యక్తం చేస్తున్న
కాంగ్రెస్ శ్రేణులు.



సారపాకలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన



పరకాలలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ



దేవరకొండలో కేంద్ర
ప్రభుత్వ నియంతృత్వ
ధోరణిని తీవ్రంగా
ఖండిస్తున్నాజిల్లా
యువజన కాంగ్రెస్
నాయకులు



నారాయణ ఖేడ్ లో కాంగ్రెస్ భారీ ధర్నా



జనగామ జిల్లాలో ధర్నా చేస్తున్న ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్